ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

సంపుటి : 02 సంచిక : 44 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం 13 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02

# చాలా ఫిర్యాదులున్నాయి

## అధికారులు పీపుల్స్ ఫ్రెండ్లీగా మారాలి: చంద్రబాబు

- కలెక్టర్ల కాన్ఫరెన్సులో అటవీశాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- అటవీశాఖ అధికారులు పీపుల్స్ ఫ్రెండ్లీగా మారాలంటూ సీఎం సూచన
- అటవీశాఖ అధికారుల వల్ల ఏర్పడ్డ ఇబ్బందులను ప్రస్తావించిన సీఎం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో పోటీ
- భారీ పెట్టుబడులకు చొరవ తీసుకోవాలి
- ఆయా జిల్లాల్లో ఉన్న వనరులు, అవకాశాలు, అనుకూల పరిస్థితులను బట్టి ప్రణాళికలు
- టూరిజంపై దృష్టి పెట్టాలి – సంపద సృష్టి అవకాశాలను ఉపయోగించుకోవాలి : చంద్రబాబు
- కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు
- పాపికొండలు, గండికోట భారత్‌కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుందన్న సీఎం
- వేగంగా భూ కేటాయింపులు, అనుమతులు
- అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం
- అందుకే 3 రీజినల్ అథారిటీల ఏర్పాటు
- కలెక్టర్ల సదస్సులో సీఎం దిశా నిర్దేశం

పరిశ్రమలు పెట్టేక్రమంలో స్థానిక ప్రజల్లో అపోహలుంటే వెంటనే కలెక్టర్లు వెళ్లి సమావేశాలు పెట్టాలి. వారికి అర్థమయ్యేలా చెప్పాలి. డబ్బుల్లేవు.. భూముల్లేవంటే పనులు కావు.. రైతులను, రాజకీయ నాయకులను దారిలోకి తీసుకురండి. అప్పుడే పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది.

"అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి. ఈసారి అటవీశాఖ విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై డిప్యూటీ సీఎంతో మాట్లాడాను, మళ్లీ మరోసారి మాట్లాడతాను. గ్రీన్ కవర్ పెంచండి, బయోడైవర్సిటీకి వెళ్లాలి. ప్రజలు ఆహ్లాదంగా పర్యటించేందుకు ఉపయుక్తంగా పరిస్థితులు మారాలి.ప్రైవేటు, అటవీ, ఎండోమెంట్ క్లాసిఫికేషన్ల ప్రకారం రిజర్వు ల్యాండ్‌ను గుర్తించాలి. కొందరు అటవీ అధికారుల ఇంప్రాక్టికల్ థింకింగ్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా?". - చంద్రబాబు, సీఎం

'రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైఎస్సార్సీపీ హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమే.' -చంద్రబాబు, ముఖ్యమంత్రి




అమరావతి, మార్చి 12:- పెట్టుబడులు రాబట్టడం ఆయా శాఖలకు సంబంధించిన అంశంగా కాకుండా... జిల్లా కలెక్టర్లు కూడా బాధ్యతగా తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పెట్టుబడులు రాబట్టుకునేలా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో పెట్టుబడులను రాబట్టేలా కలెక్టర్లు కమిట్మెంట్‌తో పెట్టుబడిదారులను అన్వేషించి... పెట్టుబడులు పెట్టేందుకు కన్విన్స్ చేసి... ముందుకు వచ్చిన వారికి పూర్తిగా కో-ఆపరేట్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లకు 3జ ఫార్ములాను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున ముఖ్యమంత్రి వివిధ అంశాలపై సమీక్షించారు.

# సాహసోపేతంగా...!

- ముంబైకి చేరుకున్నషెన్‌లాంగ్ నౌక
- సిగ్నళ్లు, లైట్లు ఆర్పేసి జాగ్రత్తగా హార్ముజ్‌ను దాటిన ముడిచమురునౌక
- విజయవంతంగా ముంబైకి చేరుకున్నషెన్‌లాంగ్ నౌక
- ఓడకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారతీయుడు సుఖ్‌శాంత్ సంధూ


సంకల్పంతో ముందుకెళితే మార్గమధ్యంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు సరైన వ్యూహాలు అక్కరకొస్తాయంటారు. శత్రు నౌకలు, జలాంతర్గాముల సంచారాలను అడ్డుకునే సముద్ర మందుపాతరలైన 'సీమైన్స్'ను హార్ముజ్ జలసంధిలో అక్కడక్కడా ఇరాన్ ఏర్పాటుచేసినా సరే దృఢనిశ్చయంతో అదే మార్గంలో ప్రయాణించి ముడి చమురునౌక షెన్‌లాంగ్ సూయిజ్‌మ్యాక్స్ సాహసోపేత యాత్రను పూర్తిచేసింది. పశ్చిమాసియా యుద్ధం మొదలయ్యాక హార్ముజ్ జలసంధి గుండా ఎలాంటి దాడుల బారిన పడకుండా సురక్షితంగా ముంబై చేరుకున్న తొలి నౌకగా షెన్‌లాంగ్ సూయిజ్‌మ్యాక్స్ పేరు ఇప్పుడు మార్మోగిపోతోంది. బుధవారమే నౌక ముంబైకి చేరుకున్నప్పటికీ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌక మార్చినెల ఒకటో తేదీన సౌదీ అరేబీయాలోని రాస్ తనూరా నౌకాశ్రయంలో ఏకంగా 1,35,335 మెట్రిక్ టన్నుల ముడిచమురును నింపుకుంది. మార్చి మూడో తేదీన అక్కడి నుంచి బయల్దేరి క్షేమంగా ముంబై పోర్ట్‌కు చేరుకుంది.



# సర్కారీ ఆస్పత్రుల్లో నెల రోజులుపని చేయండి

- ఏడాదికోసారి ఇలా సేవలందించండి
- మానవత్వంతో చికిత్స చేస్తేనే ఆస్పత్రులు, డాక్టర్లపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది
- మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కార్పొరేట్ వైద్యులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే!
- ఫోర్త్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు భూమి ఇస్తాం
- నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ప్రారంభోత్సవంలో సీఎం
- నిజాం స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవం
- ఆధునిక వసతులతో పర్యావరణహితంగా అభివృద్ధి
- నేడుమూసీ అభివృద్ధి ప్రణాళిక ఆవిష్కరణ
- ఏటా 8-10 లక్షల మంది రోగుల రాక..
- హాలీవుడ్‌తో పోటీ పడదాం: సీఎం రేవంత్

కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు ఏదైనా ప్రభుత్వాస్పత్రిలో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. "ఏడాదిలో 11 నెలలు మీ కోసం, మీ కుటుంబం కోసం, మీరు పనిచేస్తున్న సంస్థల కోసం పనిచేయండి. ఒక్క నెల మాత్రం మీకు దగ్గరలో ఉన్న ఏదైనా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయడానికి ప్రయత్నించండి. దాని వల్ల మీరు మరింత నేర్చుకునేందుకు అవకాశం లభిస్తుంది. ప్రజలకు మీపై నమ్మకం కలుగుతుంది. ప్రభుత్వాలు మిమ్మల్ని గౌరవించే విధానం మారుతుంది. ఇందుకోసం ఓ వెబ్‌సైట్ ప్రారంభించనున్నాం. మీకు తీరిక దొరికినప్పుడు వచ్చి సేవలందించండి. అందుకు అవసరమైన ఏర్పాట్లు మేం చేస్తాం" అని సీఎం కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులకు పిలుపునిచ్చారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికవర్ హాస్పిటల్‌ను గురువారం వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో కూడిన మెడికవర్ ఆస్పత్రులకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. ప్రైవేట్ డాక్టర్లు కూడా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగమైతే, పేదలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు.



# యుద్ధ విరమణకు 3 షరతులు

- అమెరికా, ఇజ్రాయెల్ ముందు ఇరాన్ డిమాండ్లు
- మా చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలి
- యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలి
- భవిష్యత్తులో దాడి చేయకుండా అంతర్జాతీయ హామీ కావాలి
- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ డిమాండ్
- ప్రాంతీయ శాంతి సుస్థిరతకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటన

అమెరికా, ఇజ్రాయెల్‌తో రెండు వారాలుగా సాగుతున్న భీకర యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. అయితే, అందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 'రష్యా, పాకిస్థాన్ నేతలతో మాట్లాడుతున్నాను. ఈ ప్రాంతంలో (పశ్చిమాసియా) శాంతిని నెలకొల్పేందుకు ఇరాన్ సిద్ధంగా ఉంది. యూదులు, అమెరికా కలిసి ప్రారంభించిన ఈ యుద్ధం ఆగాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను ఆ దేశాలు గుర్తించాలి. యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో మళ్లీ మాపై దాడి జరగదని స్పష్టమైన అంతర్జాతీయ హామీ ఇవ్వాలి' అని పెజెష్కియాన్ డిమాండ్ చేశారు. మరోవైపు దీర్ఘకాల యుద్ధానికి సిద్ధంగా ఉండాలని అమెరికా, దాని మిత్ర దేశాలను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్

# చాలా ఫిర్యాదులున్నాయి

పెట్టుబడి, టూరిజం శాఖలపై జరిగిన చర్చలో సీఎం కీలకాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులు వస్తే... స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ పేరుతో అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజిజయన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్, తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టుబడులపై ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి. అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం. ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయి. ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**పెట్టుబడులపై జిల్లాల్లోనూ సమావేశాలు పెట్టాలి**

"పెట్టుబడులపై జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలి. పెట్టుబడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంపై జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది... వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం... ఎకో సిస్టం కల్పించాం. ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోంది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి... లేదా ఐటీని ప్రమోట్ చేయాలి... ఎంఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి.. అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలి. ఇలా ఏదో ఒక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను, అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలి. జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేసి పెట్టుబడులను ఆకర్షించాలి. పెట్టుబడులు పెట్టేవారందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు... మంత్రులు అనుకోకూడదు. పెట్టుబడులు పెట్టే వారెవరో గుర్తించి వారిని కలెక్టర్లు, మంత్రులు సంప్రదించే పరిస్థితి రావాలి. ఇదే విధంగా హైదరాబాద్ ను ప్రమోట్ చేయడం వల్లే xాదీ వచ్చింది. జిల్లాల్లో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలు, తలసరి ఆదాయం ఎంతమేర పెంచాం అన్నదానిపై జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలి. తదుపరి సమావేశం నుంచి ఏ జిల్లా కలెక్టర్ ఎంతమేర పరిశ్రమల్ని ప్రోత్సహించారన్న దానిపై సమీక్షిస్తాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే లాంటి ఇన్ఫ్రా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హిందుపూర్ సమీపంలో ఎలక్ట్రానిక్స్ సిటీని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ఆతిథ్య రంగంలో అభివృద్ధికి ఆస్కారం**

"ఏపీలో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అందుకే పర్యాటకానికి పారిశ్రామిక హోదాను కల్పించాం. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారు. ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు.. ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసే అంశంపై ఫోకస్ పెట్టాలి. పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి.. వాటికి ఎంతో చరిత్ర ఉంటుంది.. వాటిని ఎంకరేజ్ చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలి. వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలు పెద్ద ఎత్తున రావాలి. కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు నిర్మాణం చేయాలి. యుద్ధ ప్రభావాల నేపథ్యంలో విదేశాల కంటే స్థానికంగా ఉండే పర్యాటకానికి పెద్దఎత్తున ఆకర్షణ పెరుగుతుంది. దేవాలయాలు పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు... మానసిక ఉల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు వాటిని అభివృద్ధి చేయాలి. పాపికొండలు, గండికోట భారత్ కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుంది. జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి. టూరిజం ఎక్స్పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో పాటు మాన్యుమెంట్లను కూడా అభివృద్ధి చేయాలి. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుంది. కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు. పులికాట్ సరస్సులో పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్టాత్మక కంపెనీలకు అప్పగించి అభివృద్ధి చేయాలి. స్థానికుల్ని ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం చేయటం ద్వారా వేగంగా అభివృద్ధి జరుగుతుంది. జాతీయ రహదారులపై వే సైడ్ అమెనిటీస్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, నైట్ హాల్ట్ కోసం గదులు నిర్మాణం చేపడితే పెట్టుబడులు వస్తాయి. ఏపీఐఐసీ ద్వారా చేసే ల్యాండ్ అలాట్మెంట్ లో 5 ఎకరాల వరకూ కేటాయింపులు చేసేలా జిల్లా కలెక్టర్లకు ఆథరైజేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. విజయవాడలోని డిస్నీల్యాండ్, భవానీ ఐ ల్యాండ్ లను పర్యాటకంగా అభివృద్ధి చేద్దాం. అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటు చేస్తాం. అమరావతిలో కంటెంట్ క్రియేషన్ చేసే వారిని ప్రోత్సహిస్తాం. ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్ద పీట వేస్తాం. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ పెరిగేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# శ్రమైక జీవన సౌందర్యం



నీలో కోపం రగిలిన
క్షణంలో నువ్వు పాటించే
ఆ ఒక్క నిముషం మౌనం
భవిష్యత్తులో కొన్ని వందల
పశ్చత్తాపాలను దూరం చేస్తుంది.

అదృష్టం అనేది వాన నుండి
వచ్చే నీరు లాంటిది
శ్రమ అనేది మాత్రం
బావి నీరు లాంటిది
నువ్వు రోజూ స్నానం
చేయాలంటే మాత్రం
ఎప్పుడో కురిసే వానని
నమ్ముకోవడం అనవసరం
కనుచుపు మేర మన కళ్ళముందే
బావిలో ఉన్న నీటిని నమ్ముకో!

మనిషి అనేవాడు
సామాన్య మానవుడిగా పుట్టి
బాహ్య ప్రపంచాన్ని జయించడం
అనేది ఒక ఘనమైన కార్యమే
కానీ... అదే మానవుడు
అంతః ప్రపంచాన్ని వశం చేసుకోవడం
అదొక వీరోచితమైనటువంటి
పని అవుతుందని గుర్తించుకో!

**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# సర్కారీ ఆస్పత్రుల్లో నెల రోజులుపని చేయండి

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పెట్టే భోజనం ఎన్ని కేలరీలు ఉంటుందనేది రియల్ టైమ్‌లో తెలుసుకునేందుకు ఓ యాప్‌ను తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ యాప్ గురించి ఇటీవలే ఓ డాక్టర్ తనకు వివరించారని, ఈ తరహా నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం స్వాగతిస్తుందని చెప్పారు. వైద్యం అనేది యాంత్రికంగా చేసేది కాదని, పేదలకు మానవత్వంతో చికిత్స చేసినప్పుడే ఆస్పత్రులు, వైద్యులపై నమ్మకం కలుగుతుందని అన్నారు. దేశంలో హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని, కొవిడ్ వ్యాక్సిన్లలో మూడు ఇక్కడి జినోమ్ వ్యాలీలో తయారవడం గర్వకారణమని తెలిపారు.

**ఏటా 8-10 లక్షల మంది రోగుల రాక..**

ఆరోగ్య పరంగా తెలంగాణ ఎంతో ముందు ఉందని సీఎం రేవంత్ చెప్పారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి మెరుగైన వైద్యం కోసం తెలంగాణకు ఏటా 8-10 లక్షల మంది రోగులు వస్తున్నారని తెలిపారు. వీరిలో విదేశీయులు 2 లక్షల మంది ఉంటున్నారన్నారు. ఎయిర్ కనెక్టివిటీ బాగుంటే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని, ఆ దిశగా కేంద్ర పౌర విమానయాన శాఖతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. పశ్చిమాసియా, పొరుగు దేశాల నుంచి నేరుగా హైదరాబాద్‌కు విమానాలు ఉంటే వైద్య పర్యాటకం మరింత పెరుగుతుందని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆ దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 20 ఏళ్ల ఆరోగ్యశ్రీ సమాచారాన్ని విశ్లేషించి, ఏయే ప్రాంతాల్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. క్యాన్సర్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించామని, డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించుకొని ఆయన సలహాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కోసం దాదాపు రూ.1800 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు పెంచేందుకు, కొత్తగా మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి త్వరలోనే డిజిటల్ హెల్త్ కార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు.

**నర్సరీ నుంచి 12వ తరగతి దాకా..**

విద్యావిధానంలో సంస్కరణలు తీసుకురాబోతున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్యను పాఠశాలల్లోనే అందించేలా చర్యలు తీసుకోబోతున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాల విద్యలోనే ఇంటర్మీడియట్ విద్యను కలిపేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి భోజన వసతితో పాటు రవాణా సౌకర్యం కూడా అందించే ఏర్పాట్లు చేయనున్నామని వివరించారు. విద్యార్థుల్లో నైపుణ్యం కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన విద్య అందించగలిగితే సంక్షేమ పథకాలను ఎక్కువగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, సామాజిక భద్రతపై తమ ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందని, ఆ ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. దాదాపు 90 శాతం వైద్యచికిత్సలు జిల్లా స్థాయిలోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగా, ముఖ్యమంత్రి పిలుపుకు మెడికవర్ హాస్పిటల్స్ ఈడీ డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి స్పందించారు. తామందరం ఒక నెల పాటు ముఖ్యమంత్రి కోరినట్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయడానికి సిద్ధమేనన్నారు. ముఖ్యమంత్రి ఆశయాల్లో మెడికవర్ భాగస్వామిగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దూరదృష్టితో ప్రత్యేక వైద్య సేవలను అందించేలా ఆస్పత్రులను తీర్చిదిద్దడం వల్ల తాము కూడా మెరుగైన వైద్య సేవలను అందించడానికి పోటీ పడాల్సి వస్తోందన్నారు. డిజిటైజేషన్ ఆలోచన అద్భుతమని, రాబోయే మూడు నాలుగేళ్లలో ఆరోగ్య సంరక్షణ పరంగా తెలంగాణ అగ్రగామిగా నిలిచేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా ఎండీ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ వాసులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించామన్నారు.

# అనకాపల్లి జిల్లా ఎలమంచిలి లో ఘనంగా వైఎస్ఆర్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం

**విజ్ఞానపత్రిక రాంబిల్లి రిపోర్టర్ కోట్ని బాబురావు** అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం దగ్గర వైయస్సార్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే శ్రీ కరణం ధర్మశ్రీ పార్టీ జెండా ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు అనంతరం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్తకు వచ్చే జగన్ గారు ప్రభుత్వంలో భరోసానిచ్చి తగిన గుర్తింపునిస్తుందని అందుకు ప్రతి కార్యకర్త వైస్ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రి చేసే వరకు కష్టపడి పని చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ కార్యదర్శి మాజీ ఎంపీపీ బోధిపు గోవిందు ఎలమంచిలి మునిసిపాలిటీ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ బొద్ధపు ఎర్రయ్య దొర మున్సిపల్ వైస్ చైర్మన్ అ రేపు గుప్తా అచ్యుతాపురం ఎంపీపీ కోన లచ్చున్ననాయుడు గొట్టిముక్కల శిరీష శ్రీనుబాబు జెడ్పీటీసీలు నర్మల కుమార్ సేనాపతి సంధ్యారాము ధూళి నాగరాజు లాలం రాము నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాథ్ దేశంశెట్టి శంకర్రావు పిన్నమరాజుకిషోర్ రాజు ఆడారి గణపతి అచ్చయ్యనాయుడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఉద్దానశీ త్రినాధరావు పార్టీ సీనియర్ నాయకులు కన్నం తిరుపతిరావు పెద్దపల్లి కుమార్ కొటారు కొండబాబు గొర్ల వెంకట్ పిల్లా త్రినాథ్ నాగిరెడ్డి మురళీకృష్ణ గేదెల శ్రీను ద్వారపురెడ్డి గోవిందరావు సర్పంచులు ఎంపీటీసీలు వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



# యుద్ధ విరమణకు 3 షరతులు

సలహాదారు అలీ ఫదావీ హెచ్చరించారు. కాగా, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్ బుధవారం ఫోన్ లో మాట్లాడారు. ఒమన్‌లోని సలాలాహ్ నౌకాశ్రయంపై ఇరాన్ దాడి చేయటంపై సుల్తాన్ నిరసన తెలిపినట్లు ఒమన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ యుద్ధం మొదలైన తర్వాత ఒక పశ్చిమాసియా దేశాధినేత ఇరాన్ ఉన్నత స్థాయి నేతతో మాట్లాడటం ఇదే తొలిసారి.

ఇరాన్‌లో దాడులు చేసేందుకు ఇంకా టార్గెట్‌లు ఏవీ మిగల్లేదని చెప్తూ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సంకేతాలిచ్చిన నేపథ్యంలో పెజెష్కియాన్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, యుద్ధం ముగింపునకు అమెరికా ముందుకొచ్చినా అందుకు ఇజ్రాయెల్ ఒప్పుకొనే అవకాశాలు తక్కువేనని విశ్లేషకులు అంటున్నారు. ఇరాన్‌లోని ప్రస్తుత పాలకులను పూర్తిగా తొలగించటమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 28న దాడి మొదలైన తొలిరోజే ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీని వైమానిక దాడిలో చంపివేశాయి. అప్పటి నుంచి ఇరాన్‌లోని అనేక సైనిక, పరిపాలనా కేంద్రాలను నేలమట్టం చేశాయి. ఇరాన్ కూడా పశ్చిమాసియా దేశాల్లోని అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌పై కూడా ఎడతెరిపి లేకుండా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. హోర్ముజ్ జలసంధిని మూసివేయటంతో చమురు, గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని విరమించాలని అమెరికాపై దాని మిత్రదేశాలు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అమెరికా కూడా ఇరాన్‌పై దాదులను కాస్త తగ్గించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఇజ్రాయెల్ మాత్రం అటు లెబనాన్‌పై, ఇటు ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగిస్తూనే ఉంది. తమ లక్ష్యం పూర్తిగా నెరవేరేవరకు యుద్ధాన్ని ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా ఇరాన్ పెట్టిన మూడు షరతులను అమెరికా, ఇజ్రాయెల్ ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకొనే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు.

**మిగ్-29ను నడిపిన వాయుసేన అధిపతి**

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో భారత వాయుసేన (ఐఏఎఫ్) అప్రమత్తమైంది. యుద్ధ సన్నద్ధతపై ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ దృష్టి పెట్టారు. దేశంలోని అత్యంత కీలకమైన పశ్చిమ కమాండ్ పరిధిలోని ఎయిర్ బేస్‌ను గురువారం ఆయన సందర్శించి, ఆధునీకరించిన మిగ్-29 యుద్ధ విమానాన్ని దాదాపు 45 నిమిషాల పాటు స్వయంగా నడిపారు. నాలుగో తరానికి చెందిన ఈ యుద్ధ విమానాల పనితీరును పరిశీలించారు. పశ్చిమ కమాండ్‌లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది సన్నద్ధత, యుద్ధ విమానాల నిర్వహణ తదితర అంశాలను కూడా ఏపీ సింగ్ సమీక్షించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పశ్చిమ, ఉత్తర కమాండ్‌లలో మిగ్-29, మిగ్- 29 యూపీజీ యుద్ధ విమానాలతో కూడిన మూడు స్క్వాడ్రన్లను ఐఏఎఫ్ నిర్వహిస్తోంది. గత ఏడాది పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మిగ్-29 యుద్ధ విమానాలు కీలకపాత్ర పోషించాయి.

# ఘనంగా మాచర్ల జనసేన పార్టీ సమన్వయకర్త బుస రామాంజనేయులు జన్మదిన వేడుకలు



**విజ్ఞాన్ దినపత్రిక, మణికుమార్,కారంపొడి (మార్చి: 13)** పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో వంగవీటి మోహన్ రంగ బొమ్మ వద్ద మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బుస రామాంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన జన సైనికులు. ముందుగా కేక్ కట్ చేసి జన సైనికులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జనసైనికులు ఘనంగా సన్మానించి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని జనసేన పార్టీలో ఉన్నతి పదవులు పొందాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిబిఎస్ ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం

- కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ కావలి రెడ్ క్రాస్ రక్తకేంద్రం విజ్ఞప్తి మేరకు డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కళాశాల నుండి 25 మంది విద్యార్థులు రెడ్ క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ ఏడాదికి కనీసం ఒకసారి రక్తదానం చేయడానికి ప్రయత్నించండి. ఆపదలో ఉన్నవారికి సహాయపడటానికి స్థానిక బ్లడ్ బ్యాంకులు లేదా ఎన్జీవోలతో అనుసంధానం అవ్వండి. రక్తదానం చేయండి, ప్రాణాన్ని కాపాడండి, రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరోను కాపాడేందుకు రెడ్ క్రాస్ లాంటి బ్లడ్ స్టోరేజ్ బ్యాంకులు అహర్నిశలు ఇలాంటి కార్యక్రమాల కోసం దృష్టి సాధించటం దీనిలో భాగంగా, మా డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలను సంప్రదించటం అందులో మేము మా విద్యార్థులు భాగస్వాములు కావటం మాకు సంతోషాన్ని ఇస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలోకళాశాల విద్యార్థులు, కళాశాల ఫిజికల్



డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్, రెడ్ క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి, కావలి రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె హరి నారప రెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, యన్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ పరిశ్రమ శంకుస్థాపనకు మంత్రి నారా లోకేష్ రాక..!

**-తిరుపతి విమానాశ్రయం లో మంత్రి నారా లోకేష్ కి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఘన స్వాగతం..!**





తిరుపతి మార్చి 12న నెల్లూరు జిల్లా, బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో ఏర్పాటు చేయనున్న సాగర్ డిఫెన్స్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రినారా లోకేష్ ని తిరుపతి విమానాశ్రయంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆత్మీయంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు పరస్పరం అభివాదాలు మార్చుకొని జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా జువ్వలదిన్నె గ్రామంలో స్థాపించబోయే సాగర్ డిఫెన్స్ పరిశ్రమ ప్రాజెక్ట్ గురించి చర్చించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రాంతీయ యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు నెల్లూరు జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. తిరుపతి విమానాశ్రయంలో జరిగిన ఈ స్వాగత కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు కూడా పాల్గొని మంత్రివర్యులకు హృదయపూర్వక స్వాగతం పలికారు.

# మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో విద్యార్థులకు కిడ్నీ ఆరోగ్యం పై అవగాహనా సదస్సు







గూడూరు : ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీ ఆరోగ్యంపై విద్యార్థుల లో అవగాహన పెంపొందించేందుకు నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో కిడ్నీ ఆరోగ్యం పై అవగాహనా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, కాలేజీ సిబ్బంది, మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిడ్నీ ఆరోగ్య ప్రాముఖ్యతను విద్యార్థుల కు తెలియజేసినారు .ప్రస్తుతం మధుమేహం, రక్తపోటు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. కిడ్నీ వ్యాధులను ముందుగానే గుర్తించడం, సరైన జీవనశైలిని పాటించడం మరియు నియమితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. ఎం వెంకట సురేష్ కుమార్ రెడ్డి కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు మాట్లాడుతూ, “మన శరీరంలో కిడ్నీలు అత్యంత ముఖ్యమైన అవయవాలు. ఇవి రక్తాన్ని శుద్ధి చేసి శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. చాలా సందర్భాల్లో కిడ్నీ వ్యాధులు ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చు” అని తెలిపారు. డా. జి. గోకుల్ నచ్చికేత్ ,కన్సల్టెంట్ యూరాలాజిస్ట్ మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు మాట్లాడుతూ, “ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ అవగాహనా శిబిరం ద్వారా విద్యార్థుల లో కిడ్నీ ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడం మా ముఖ్య లక్ష్యం. సరైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, రక్తపోటు మరియు మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం వంటి సాధారణ జాగ్రత్తలు పాటిస్తే కిడ్నీ వ్యాధులను చాలా వరకు నివారించవచ్చు” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ జి రంజిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ దనుంజయ, రాజయ్య, సురేష్ కాలేజీ సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ....

**అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం**

**దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో నూతన అధ్యాయం ప్రారంభమైంది**

**జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి**

**ఈ ప్రాజెక్ట్ ద్వారా మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది**

**ఎలాంటి అపోహలకు గురికావద్దు, మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది**

**నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్ లో అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ కు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్**

**కావలి :విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** నెల్లూరు: మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ రూపుదిద్దుకుంటుంది. అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం. దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో నూతన అధ్యాయం ప్రారంభమైందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మెరైన్ షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం. ఈ రోజు ఇక్కడ జరుగుతున్న కార్యక్రమం కేవలం ఒక కొత్త పరిశ్రమ ప్రారంభం మాత్రమే కాదు.. భారతదేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీకి ఒక కొత్త అధ్యాయం ప్రారంభం. భారతదేశం ఒక సముద్ర దేశం. మన దేశానికి 7,500 కిలోమీటర్లకు పైగా తీరరేఖ ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో రెండో పొడవైన తీరరేఖ ఉంది. మనకు సముద్రం అంటే.. అదో జీవనోపాధి, వాణిజ్యం, సంస్కృతి, అవకాశాల కేంద్రం. మన తీరప్రాంత జిల్లాల్లో లక్షలాది కుటుంబాలు తమ జీవనోపాధి కోసం సముద్రంపై ఆధారపడుతున్నాయి. మన మత్స్యకారులు ప్రతిరోజు అనిశ్చితమైన సముద్రంలోకి వెళ్లి, తమ ప్రాణాలను పణంగా పెట్టి మనకు ఆహారం అందిస్తున్నారు. తీరప్రాంత ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్నారు. అందుకే తీరప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి, సముద్ర భద్రత, మత్స్యకారుల కోసం సాంకేతికత మనకు అత్యంత ముఖ్యమైనవి. ఈ రోజు ప్రారంభమవుతున్న ప్రాజెక్ట్ వాటిని సాకారం చేస్తుంది.



**జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25వేల మత్స్యాకార కుటుంబాలకు లబ్ధి**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేయడం జరిగింది. ఈ హార్బర్‌లో ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ లు, వేలం హాళ్లు, వలల మరమ్మతు యార్డ్ లు, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయంతో పాటు చేపల నిర్వహణ సదుపాయాలు వంటి ఆధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ హార్బర్ ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి. సుమారు 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపే సదుపాయం కల్పించాం. ప్రతి ఏడాది ఈ హార్బర్ ద్వారా 41 వేల టన్నుల చేపలు దిగుబడి జరుగుతోందని అంచనా. దీని వల్ల నెల్లూరు జిల్లాలో మత్స్య ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. అయితే ఇక్కడ భద్రత అనేది చాలా ముఖ్యం. తుఫానులు, తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో మన మత్స్యకారులు సముద్రంలో భారీ ప్రమాదాలను ఎదుర్కొంటారు. అలాంటి సందర్భాల్లో ఈ హార్బర్ సేఫ్ షెల్టర్ లా పనిచేస్తుంది. మత్స్యకారులు తమ కష్టంతో కొనుగోలు చేసిన పడవలు, ఇంజన్ లు, వలలు వంటి ఆస్తుల పరిరక్షణకు సహాయపడుతుంది. మత్స్యకార కుటుంబాలకు పడవ అంటే కేవలం పరికరం కాదు.. అది వారి జీవనోపాధి. ఆ జీవనోపాధిని కాపాడటం మన బాధ్యత.

**దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పక్కనే భవిష్యత్ దిశగా అడుగు వేసే మరో ప్రాజెక్ట్ కు నేడు శంకుస్థాపన చేశాం. 29.58 ఎకరాల విస్తీర్ణంలో సాగర్ ఢిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ ను నిర్మిస్తోంది. ఈ కేంద్రంలో ఆధునిక సముద్ర సాంకేతికతలను రూపకల్పన చేసి తయారు చేస్తారు. మనుషుల్లేని సముద్ర ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్, ఏఐ ఆధారిత సముద్ర పర్యవేక్షణ వ్యవస్థలు, నావిగేషన్ సాంకేతికతలను రూపొందించనున్నారు. ఇవి తీరప్రాంత పర్యవేక్షణ, పోర్ట్ భద్రత, విపత్తు నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, సముద్ర రక్షణ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. సముద్ర భద్రత ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. తీర పర్యవేక్షణ, సముద్ర భద్రతను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

**మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది**

ఇక్కడ అభివృద్ధి చేస్తున్న అటానమస్ మారిటైం సిస్టమ్స్.. మన జలాలను సంరక్షించడంతో పాటు పోర్టుల భద్రత, దేశాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతోపాటు ఈ సాంకేతికతలు మన మత్స్యకారులకు కూడా ఉపయోగపడతాయి. భవిష్యత్తులో ఇవి మత్స్యకారులకు రియల్ టైంలో వాతావరణ సమాచారం, చేపల గుర్తింపు, నేవిగేషన్ సహాయం వంటి సేవలను అందిస్తాయి. దీంతో సముద్రంలో భద్రత పెరుగుతుంది, ఇంధన వ్యయం తగ్గుతుంది, మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది. సాంకేతికత రక్షణ కోసం మాత్రమే కాకుండా సాధారణ ప్రజల జీవితాలను మెరుగుపర్చడానికి కూడా దోహదపడాలి.

**మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది**

మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది. ఈ ప్రాజెక్ట్ పట్ల మీకు ఎలాంటి అపోహలు అవసరం లేదు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అద్భుతమైన మారిటైం కంపెనీని తీసుకువచ్చాం. వీరు ఓ వైపు డిఫెన్స్ పరికరాలు తయారుచేస్తూ.. మనకు కూడా అండగా నిలబడతారు. మన సంపద, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు సహకారం అందిస్తారని మత్స్యకార సోదరులకు హామీ ఇస్తున్నా. మత్స్యకార కుటుంబాల్లోని యువతలో అపార నైపుణ్యాలు ఉన్నాయి. ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంస్థను కోరుతున్నా.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా బలం**

రాష్ట్రంలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలో మూడు బలమైన కారణాలు ఉన్నాయి. మొదటిది చంద్రబాబు గారి బ్రాండ్. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విశ్వసనీయత, దూరదృష్టి పరిశ్రమలతో దీర్ఘకాల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఏపీలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. ప్రభుత్వ ప్రాజెక్ట్ అవుతుంది. త్వరితగతిన పెట్టుబడి సాకారం అయ్యేలా చూస్తాం. మూడో కారణం.. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. నమో అంటే నాయుడుజీ, మోదీజీ కలయిక.

**మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ**

సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ కు భారత్ బయోటెక్ కీలక పెట్టుబడిదారుగా మద్దతు ఇస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇంజనీర్లు, సముద్ర సాంకేతిక నిపుణులు, రోబోటిక్స్ నిపుణులు, యువ ఆవిష్కర్తలకు అధిక నైపుణ్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సముద్ర సాంకేతికతలో పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం ఇస్తుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, అటానమస్ మారిటైం షిప్ యార్డ్ ఈ ప్రాంతాన్ని మత్సరంగం, సముద్ర సాంకేతికతకు ప్రధాన కేంద్రంగా మార్చబోతున్నాయి. తీర భద్రతను బలోపేతం చేస్తుంది. మత్స్యకారుల జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా నిలుపుతుంది. ఈ రోజు జరిగిన శంకుస్థాపన కేవలం ఒక నిర్మాణానికి ప్రారంభం మాత్రమే కాదు.. నూతన వ్యవస్థకు ఆరంభం. ఈ ప్రాజెక్టును సాకారం చేసిన సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్, భారత్ బయోటెక్, ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డ్, ఇతర భాగస్వాములకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్ట్ గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. ఏ అవసరం వచ్చినా వాట్సాప్ మెసేజ్ దూరంలో ఉంటానని మంత్రి చెప్పారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమానికి తరలివచ్చిన స్థానిక మత్స్యకారులను ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి, సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్, సీహెచ్ ఆర్వో శ్రీమతి సన్యుక్తా సింగ్, ఆర్కేపీ సింగ్, ఏపీ మారిటైం బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.